దూరం! దూరం

సి. నాగరాజారావు

టేబుల్ మీద ఫైల్సు ఒకదాని మీద ఒకటి పేరుకు పోతున్నాయి. ఒక ఫైలు తీశాడు శేఖర్. అది చాలా క్లిష్టమైన సమస్యకు సంబంధించిన ఫైలు. కళ్ళు అక్షరాల వెంట పరుగెడుతున్నా శేఖర్ మనసు మనసులో లేకపోవడంతో ఏం చెయ్యాలో తెలియక ఏదో క్వైరే వేసి ప్రక్కన పారేశాడు. ఏ ఫైలు తీసినా ఎన్ని పేజీలు తిరగవేసినా, ఎవరితో మాట్లాడుతున్నా తన దృష్టి మాత్రం రేఖ మీదనే వుంది. ఆమె మధుర స్వరమే తన చెవుల్లో పదే పదే వినిపిస్తోంది.

'రేఖ దగ్గరకు వెళ్ళిపోవాలి. రేఖ కౌగిలిని చేరుకోవాలి. అంతకంటే అదృష్టమేముంది? ...న్నంతగా కోరుకునే అందాల రాశికి దాసుడనయ్యే కంటే ఈ జన్మకి సార్థకత ఏముంది?...' ఏవేవో ఆలోచనలతో శేఖర్ మనసు పరి పరి విధాల పోయింది.

చూస్తుండగానే ఫైల్సు కుప్పలా పేరుకు పోతున్నాయి. మెల్లగా మూడు నెలలు గడిచాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది వ్యవహారం. ఒక్క ఫైలు కదలట్లేదు. ఊళ్ళో కార్యక్రమాలేవీ జరగట్లేదు. ఎక్కడ చూసినా విమర్శలు వినవస్తున్నాయి. కొత్తాఫీసరు పనితీరు ఏమీ బాగుండలేదని అందరూ అనుకోసాగారు. చివరికి శేఖర్ని బదిలీ చేయించాలనే ప్రయత్నం కూడా జరిగింది.

'ఇక లాభం లేదు. ప్రేమ జబ్బు బాగా ముదిరి పోయింది. ఇక ఈ ఊళ్ళో పని చెయ్యడం కష్టం. శలవు మీద వెళ్ళిపోవడం ఒక్కటే శరణ్యం,' అని నిర్ణయించుకున్నాడు శేఖర్.

ఫోన్ మోగింది. తీశాడు శేఖర్.

"హలో! శేఖర్ గారున్నారాండీ?" ఫోనులో ఒక స్త్రీ మధురస్వరం.

"ఆ నేనే శేఖర్ని మాట్లాడుతున్నాను" అన్నాడు శేఖర్.

"అప్పుడే నన్ను మర్చిపోయారా?" ఆ గొంతులో కొంత సిగ్గు, ప్రేమ, అనురాగం అన్నీ వ్యక్తమయ్యాయి.

వెంటనే అర్థమైంది శేఖర్కి. అతని ఆనందం అవధులు దాటింది.

"రేఖ, ఎక్కణ్ణించి?" ఆత్రంగా అన్నాడు శేఖర్.

"నిన్ననే గుణదల్లో మా స్నేహితురాలింటికి వచ్చాను. ఇక్కడ దాకా వచ్చి మిమ్మల్ని చూడకుండా వెళ్ళలేక ఫోను చేశాను" అంది రేఖ.

"వెంటనే బయలుదేరి రా. నేను జీప్లో నీకోసం బస్టాండులో ఎదురు చూస్తుంటాను" నా జీప్ నెంబరు..." ఆనందంతో ఉక్కిరి బిక్కిరౌతూ అన్నాడు శేఖర్.

మరొక గంటలో ఆ అపురూప సౌందర్యరాశి తన ఇంట్లో అడుగెట్టింది. తొలిసారిగా తన ఇంట్లో గాజుల గలగల, స్త్రీ మధుర స్వరం, ఇంటికి శోభని తెచ్చే స్త్రీ సహచర్యం కలిగాయి. ఒక్కసారిగా బోసిగా ఉండే తన ఇల్లు కళకళ లాడింది.

భోజనం చేసి బెడ్రూంలో బెడ్మీద వాలిపోయాడు శేఖర్. కుర్చీని బెడ్ దగ్గరకు లాక్కుని కూచుంది రేఖ. ఆమెనలా చూస్తుంటే ఏవేవో తియ్యటి ఊహలు శేఖర్ని తికమక చేస్తున్నాయి.

శేఖర్ తలవైపు మేగజైన్ పడి వుంది.

"ఆ పత్రిక కావాలండీ" అంది రేఖ.

శేఖర్ ఇచ్చేలోగా "ఫరవాలేదండి, నేను తీసుకుంటాను" అని శేఖర్కి తన స్పర్శ తగిలేలా వంగుని పత్రికని తీసుకుంది రేఖ. జీవితంలో తొలిసారి స్త్రీ స్పర్శ పొందాడు శేఖర్.

ఎంతో మధురంగా వున్న ఆ స్పర్శ మళ్ళీ పొందాలనిపించింది శేఖర్కి.

పత్రిక పేజీలు తిరగవేస్తున్న రేఖ ముఖ కవళికలను పరీక్షగా చూశాడు శేఖర్. ఆమెలో ఏవేవో చిలిపి ఊహలు ఉరకలు వేయడం ఆమె ముఖంలో స్పష్టమైంది. కొద్ది నిమిషాలు గడిచాయి.

"రా! నిద్రొస్తుంటే పడుకో" అన్నాడు శేఖర్.

ఎక్కడ పడుకోవాలో తెలియక ఒక క్షణం అటూ ఇటూ చూసింది రేఖ. ఒక క్షణం ఆగి బెడ్ మీద శేఖర్ నడుం దగ్గర కూచుంది. శేఖర్ ఆమె వైపు ఒక క్షణం ఆశ్చర్యంగా చూశాడు. స్త్రీ సిగ్గు వలన తన ప్రేమను వ్యక్తం చెయ్యదు అనుకోవడం శుద్ధ అబద్ధం అనేది ఆ క్షణం శేఖర్కి స్పష్టమైంది.

అప్రయత్నంగా శేఖర్ చెయ్యి ఆమె చేతిమీద పడి జబ్బల వరకూ పాకింది. శేఖర్ చేతిని తన చేతిలోకి తీసుకుని కొంటెగా నవ్వింది రేఖ.

"రేఖా!" మృదువుగా పిలిచాడు శేఖర్.

"ఊ!" గోముగా అంది రేఖ.

ఆమెను తనవైపు తిప్పుకున్నాడు శేఖర్. సిగ్గు నటిస్తూనే శేఖర్ వైపు తిరిగింది రేఖ. ఆమె నుదుటి మీద చిరు చెమటని రుమాలుతో ఒత్తాడు. సంభాషణ ప్రారంభమైంది. క్రమంగా ఒకరి కౌగిలో ఒకరు హత్తుకు పోయారు. ఆనందం అవధులు దాటింది. కోరిక శృతిమించబోతోంది. ఇంతలో ఫోను మోగింది.

"ప్చ్" అనుకుని పవిట సవరించుకుంటూ బెడ్ మీదనుంచే టేబుల్ మీద ఫోనందుకుని శేఖర్ చెవి దగ్గర పెట్టింది రేఖ. ఇల్లాలు కాకుండానే పరిచర్యలు చేయడం మొదలెట్టింది ప్రియురాలు.

సాయంత్రమయ్యింది.

"రాత్రికి ఉండిపోతావా?" అన్నాడు శేఖర్. అతని మాటల్లో ఏదో సందేహం వెలువడింది.

"ఉండ మంటారా?" ఆశగా అంది రేఖ.

కాని ఆ రాత్రి తనతో ఉండిపోతే ఇంకేమైనా ఉందా? ఊళ్ళో గుస గుసలు బయలుదేరతాయి. ఆమె ఎవరని అడిగితే చెప్పలేక రకరకాలుగా అబద్ధమాడాలి శేఖర్. 'ఒకవేళ జరగకూడనిది జరిగితే! నో! నో!' భయపడ్డాడు శేఖర్. ఒక క్షణం ఆలోచించాడు.

"ఉండిపో. దానికేం భాగ్యం! హాయిగా టీ.వి. పెట్టుకుని కూచో. నిద్రొస్తే పడుకో. రాత్రి పదకొండు గంటలకి నేనెలాగూ వచ్చేస్తాను" యుక్తిగా అన్నాడు శేఖర్.

"అమ్మో! అంతసేపు నేను ఒంటరిగా ఉండాలా? ఉహూ" గారంగా అని శేఖర్ గుండెలమీద వాలిపోయింది రేఖ. ఆమెను దగ్గరకు హత్తుకున్నాడు శేఖర్.

"అవును. నాకు గుంటూరులో పనుంది. వచ్చేసరికి రాత్రి పద కొండవుతుంది" అన్నాడు శేఖర్.

"ఐతే రేపు ఉదయం మళ్ళీ వస్తాను" అని వెళ్ళిపోయింది రేఖ.

"ఆమె ఉన్నంత సేపూ ఎంత హాయిగా ఉంది. సాక్షాత్తూ దేవేంద్ర లోకంలో రంభతో ఉన్నట్లే ఉంది' అనుకుని జరిగిందాన్ని పదే పదే తల్చుకున్నాడు శేఖర్.

మూడు రోజుల పాటు వరసగా అలాగే వచ్చి శేఖర్తో గడిపింది రేఖ.

మూడవ రోజున తన మనసు విప్పి చెప్పాలనుకున్నాడు శేఖర్.

బెడ్ మీద పడుకుని ఫోన్ వైపు తదేకంగా చూస్తూ ఏదో సీరియస్గా ఆలోచిస్తోంది రేఖ. ఆమెను తనవైపు తిప్పుకున్నాడు శేఖర్.

"రేఖా!" మెల్లగా ఆమె చెవిలో అన్నాడు శేఖర్.

"ఊ" శేఖర్ ఉంగరాల జుట్టు సవరిస్తూ అంది రేఖ.

"నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి" అన్నాడు శేఖర్.

"అందుకు నన్ను అనుమతి అడగాలా?" శేఖర్కి దగ్గరగా జరిగింది రేఖ.

"సరే విను..."—శేఖర్ చెప్పబోయేలోగా ఫోను మ్రోగింది.

చిలిపిగా నవ్వుతూ ఫోను తీసి శేఖర్ చెవి దగ్గర పెట్టింది రేఖ.

"ఎవరు? అమ్మా? ఆ నేనే, శేఖర్ని మాట్లాడుతున్నాను. ఏమిటి? చెల్లికి పెళ్ళి కుదిరిందా? కట్నం ఏభై వేలా? సరే, నేనెలాగో సర్దుబాటు చేస్తాను. నేను ఎల్లుండి బయలుదేరి వస్తున్నాను" అని ఫోను పెట్టేశాడు.

"శేఖర్! ఏమిటి చెప్పాలనుకున్నారు?" శేఖర్ హృదయానికి తన తలను ఆన్చి అంది రేఖ.

"సమయం వస్తుంది. తప్పకుండా చెప్తాను" అని ఆలోచనలో పడ్డాడు శేఖర్.

కొంతసేపాగి, 'మీ గుణదల స్నేహితురాల్ని తీసుకు రాకపోయావా?" అన్నాడు శేఖర్.

మౌనంగా ఉండి చిన్న చిరునవ్వు విసిరింది రేఖ. ఏమిటన్నట్లు చూశాడు శేఖర్.

"నాకు గుణదల్లో స్నేహితులెవరూ లేరు. ఆ వంకన మిమ్మల్ని చూడ్డానికి వచ్చాను. నేను హోటల్లో దిగాను" పెదవిని చిత్రంగా తిప్పుతూ అంది రేఖ.

ఆ అనురాగాల రాశిని తన్మయత్వంతో తన హృదయానికి హత్తుకున్నాడు శేఖర్. ఆ సాయంత్రం రేఖ విశాఖ వెళ్ళిపోయింది.

చెల్లెల్కి పెళ్ళి జరిగింది. శేఖర్ పేర వున్న ఎక్కౌంట్సు, డిపాజిట్స్ అన్నీ ఖాళీ అయ్యాయి. ఎలాగైతేనేం ఒక బాధ్యత గట్టెక్కింది. ఇప్పుడు తనకి పెళ్ళైతే తన స్టేటస్కి తగినట్లు అన్నీ సమకూర్చుకోవాలి. అందుకు మరొక పాతిక వేలైనా కావాలి. మరొక సంవత్సరం ఎదురు చూడాలి.

రేఖ వెళ్ళిన దగ్గర్నుంచీ ఉత్తరాలు ఒకదాని మీదొకటి రాసాగాయి. రేఖ పుట్టిన రోజుకి చీర కొని పంపించాడు.

"మీరు పంపిన ప్రేమ కానుకని ఎలా వర్ణించాలో తెలియటల్లేదు" అని ఉత్తరం రాసింది రేఖ.

చూస్తుండగానే ఒక ఏడాది గడిచింది. సుఖ సంసారానికి కావాల్సిన వన్నీ సమకూరాయి శేఖర్కి. కాని బ్యాడ్లక్. శేఖర్కి బదిలీ అయ్యింది. మళ్ళీ పోస్టింగు ఇవ్వలేదు. ఐదేళ్ళ సర్వీసులో ఆరవసారి కంపల్సరీ వెయిట్. పెళ్ళయ్యాక ఇలాంటి సమస్యలొస్తే భార్యా పిల్లల గతేమిటి? అందుకే పెళ్ళికి ముందే ఇల్లు కట్టడం అవసరమనిపించింది శేఖర్కి. నాలుగు నెలలు గడిచాక మళ్ళీ అక్కడే పోస్టింగు వేశారు. శేఖర్కి ఇల్లు కట్టడానికి లోన్ మంజూరయ్యింది.

"రేఖా! ఒక్క ఏడాదిలో మన ఇల్లు పూర్తయి పోతుంది. ఒక్క ఏడాదిలో మనం... అర్థమైందా?" అని ఉత్తరం రాశాడు శేఖర్..

"మీ ఉత్తరాలందాయి, మీరు పంపే కానుకల వల్ల, మీ ఉత్తరాల వల్ల ఈ చుట్టు ప్రక్కల నా హోదా పెరిగిపోయింది. చిన్న టీచర్ ఉద్యోగం చేసుకుంటూ గాలితో తన్నితే పడిపోయేలాంటి ఇంట్లో బ్రతికే నాకు ఇంతటి అదృష్టం పడుతుందనుకో లేదు. కాని నేను కోరుకునేది ఇవన్నీ కాదు. మీతో... ఛీ..." ఎలా ముగించాలో తెలియక అలాగే ఉత్తరం పోస్టు చేసింది.

ఒకరి కోసం ఒకరు ఆరాటపడుతూ, కలలు కంటూ మరో రెండేళ్ళు గడిచాయి. శేఖర్కి స్వంత ఇల్లు, స్వంత కారు, సకల సౌకర్యాలు అమరాయి. కాని రేఖ ఆ ఇంట్లో అడుగు పెట్టే వరకూ ఆ ఇంటికి కళా కాంతులు కలిగేలా లేవు.

పెళ్ళికి ముందు పొందాలనుకున్న వన్నీ పొందాడు శేఖర్. ఇక రేఖతో తన పెళ్ళికి ఏ ఆటంకమూ లేదు. ఇన్నాళ్ళూ భరించరాని ఒంటరితనం ఇక తనని బాధించదు. ఇంటి పోర్టికోలో కారాగే సరికి పవిట అందంగా సర్దుకుంటూ ఎదురొచ్చే రేఖలాంటి ఇల్లాలు. లోకాన్ని మరిపించే ముద్దులొలికే పాపాయి... అన్నీ శేఖర్ ఊహల్లో మెదిలాయి.

ఆరు నెలలుగా రేఖ దగ్గర్నుంచి ఉత్తరాలు లేవు. 'బహుశా నేను విశాఖ రావడం లేదని అలిగి ఉంటుంది' అనుకున్నాడు శేఖర్.

రేఖ కోసం చీరలు, టేపు రికార్డర్ తీసుకుని కార్లో విశాఖ వెళ్ళాడు శేఖర్.

ఉదయం ఏడు గంటలయింది. స్నానం చేసి, డ్రెస్ చేసుకుని స్వయంగా కారునడుపుకుంటూ బస్ కాంప్లెక్స్కి వెళ్ళాడు. దూరం నుంచే సిటీ బస్ కోసం ఎదురు చూస్తున్న రేఖ కనిపించింది. సన్నగా నాజూగ్గా ఉండే రేఖ ఇప్పుడు బాగా లావయ్యింది. మధురాతి మధురమైన ఆమె అధరాల మీద ముఖానికి ఆభరణంలా నవ్వు ఎప్పటి లాగే తనని పిచ్చెక్కించింది. ఆమెను సమీపించిన కొద్దీ తనలో ఏదో కరెంటు జివ్వున లాగింది.

దూరం నుంచే శేఖర్ని చూసింది రేఖ. కాని... అదేమిటో! తనని చూడగానే పట్టరాని ఆనందంతో ఎదురొచ్చే రేఖ అలా చలనం లేకుండా నుంచుంది.

'అవును, రేఖ కోపంగా ఉంది. కోపం రాకేమౌతుంది. ఒక్కొక్కసారి ఏడాది చెప్పిన నాలుగేళ్ళు పెళ్ళి వాయిదా వేశాను. అందుకే రేఖకి ఈ అలకై ఉంటుంది' వేగంగా కలుగుతున్న ఆలోచనలతో రేఖని సమీపించాడు.

"రేఖా!" ప్రేమగా పిలిచాడు శేఖర్.

చిన్న నవ్వు నవ్వి ఊరుకుంది రేఖ.

"ఏమిటి రేఖా అలా ఉన్నావు? ఉత్తరాలు రాయటల్లేదనా? ఇక ఉత్తరాలతో పనుండదు. ఇద్దరం ఉండేది ఒక చోటనేగా" అన్నాడు శేఖర్, ఆమె అందాన్ని ఆరాధనగా చూస్తూ.

ఆ మాటలకి రేఖ ఎంతో ఆనందంతో ఉక్కిరి బిక్కిరౌతుందనుకున్నాడు. కాని ఆమెలో ఏ చలనం లేకపోవడం శేఖర్కి ఆశ్చర్యం కలిగించింది.

"రేఖా! ఏమిటలా చిత్రంగా ఉన్నావు? ఇన్నాళ్ళూ నువ్వు కోపంగా ఉన్నా అర్థముంది. కాని ఇప్పుడెందుకు? ఇన్నాళ్ళుగా కన్న కలలు ఫలించబోతున్నాయి. భరించరాని ఒంటరితనం ఇక మనల్ని బాధించదు. స్వంత ఇల్లు, స్వంత కారు, ఎకౌంట్లో కావల్సినంత బ్యాంకు బాలెన్సు... సర్లే అవన్నీ ఇక్కడెందుకు? రా, కార్లో వెళ్తూ మాట్లాడుకుందాం" అన్నాడు శేఖర్.

దానికి సమాధానంగా—

"వద్దండీ. నేను బస్సులోనే వెళ్తాను. మావారసలే అనుమానం మనిషి" అంది రేఖ.

కథా రచయితలకు ఆహ్వానం

తెలుగువారి జీవనాన్నీ, సంస్కృతినీ సంఘర్షణనీ ప్రతిబింబించే కథలకు 'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆహ్వానం పలుకుతోంది.

మానవ జీవనంలోని వివిధ కోణాలమీద వెలుగు ప్రసరించే, ఆసక్తికరమైన కథలకు ప్రాధాన్యత వుంటుంది. కథలు నాలుగు లేక అయిదు అరఠావులకు మించకూడదు. కనీసం 2,500 పదాలకు తగ్గక ఉండాలి! కథలు ఈ కింది చిరునామాకి పంపించాలి.

ఎడిటర్,
'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆంధ్రజ్యోతి దినపత్రిక,
బంజారా హిల్స్, రోడ్ నెం.3,
హైదరాబాద్- 500 034